

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో గెమ్మిలి పంచాయతీ ఊటపాలెం గ్రామ సమీపంలో రహదారికి మధ్యన భారీ వృక్షం నేల కొరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు..మంగళవారం ఉదయం వీచిన గాలికి భారీ వృక్షం నేల కొరిగిందని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.వృక్షం కూలి పోవడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



రోడ్డుకడ్డంగా నేల కొరిగిన చెట్టు

రహస్య సర్వేను అడ్డగించిన రైతులు

-తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన -సాగు భూముల జోలికొస్తే ఖబడ్దార్: జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: సాగులో ఉన్న రైతుల భూములను విజయనగరం జమీందారుల రాజులు తమవి అంటూ స్థానిక రెవిన్యూ అధికారులతో కలిసి రహస్య సర్వేలు నిర్వహిస్తున్న బృందాన్ని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య ఆధ్వర్యాన మంగళవారం టోకూరు పంచాయతీ ములియాగుడ గ్రామం వద్ద అడ్డగించారు. అనంతగిరి, టోకూరు, ఎగువశోభ పంచాయతీ గ్రామాల సాగు రైతులు ఇక్కడ నుండి వెనక్కి వెళ్లిపోవాలని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రం కార్యాలయంలో గిరిజన సంఘం కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. తమ సాగు భూములు తమకే చెందాలని, జమిందార్ రాజులమని భూమి జోలికి వస్తే తరిమి కొడతామని నినాదాలు చేశారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ విషయమై తహసిల్దార్‌ని నిలదీశారు. అనంతరం లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి. గంగరాజు మాట్లాడుతూ, కొండిభ, టోకురు, అనంతగిరి, ఎగువశోభ పంచాయతీ పరిధిలోని అరకు రోడ్డుకు ఆనుకొని పూర్వకాలం నుండి రైతుల సాగులో ఉన్నాయన్నారు.విజయనగరం జమీందారుల రాజులమని కొంతమంది వారికి చెందిన భూములు ఉన్నాయని స్థానిక రెవిన్యూ అధికారుల అండదండలతోసర్వే నిర్వహించడం సరికాదన్నారు. 1970 సంవత్సరం ముందు జమిందార్ రాజుల పరిపాలన కొనసాగిందని, అనంతరం ఈ ప్రాంతం వదిలి వెళ్లిపోయారన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70, పీసా వంటి చట్టాలకు విరుద్ధంగా గిరిజనులు సాగులో ఉన్న భూములు జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రైతులతో కలిసి సాంప్రదాయ ఆయుధాలతో తరిమికొడతామని ఆయన హెచ్చరించారు. గిరిజన ప్రజలకు రక్షణ కవచంగా ఉండవలసిన ఐటీడీఏ పిఒ, రెవిన్యూ అధికారులు జమిందార్ రాజులకు కొమ్ము కాయడం సమంజసం కాదన్నారు.సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, జమీందార్లను భూమిలోకి అడుగు పెట్టనివ్వమని టోకూరు సర్పంచ్ కిలో .మొస్య తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయకుండా ఏ విధంగా సర్వేలు నిర్వహిస్తారని తహాసిల్దార్ రాంబాయిని ప్రశ్నించారు. ఆయా గ్రామాలకు చెందిన 150 మంది పైగా రైతులు సుమారు 300 ఎకరాల భూమి సాగులో ఉన్నారని, వీరందరికీ పట్టాలు మంజూరు చేయాలని ఆయన కోరారుతహాశీల్దార్ రాంబాయి మాట్లాడుతూ, కోర్టు ఆదేశాల అనుగుణంగా రైతులు సాగులో ఉన్న భూమి, జమీందారులకు చెందవలసిన భూమి ఎంత అనేదానిపై సర్వే జరుగుతుందన్నారు. టోకూరు, అనంతగిరి, ఎగువశోభ పంచాయతీ 8 గ్రాముల పరిధిలో సుమారు 173 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో వ్యవసాయ పంటలు, కాఫీ పండ్ల తోటలు ఎంత మేర ఉన్నాయన్న దానేపై సర్వే జరుగుతుందే తప్ప రైతులు ఎవరు అపోహ పడవద్దన్నారు. సర్వే అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.దొన్ను, వార్డు మెంబర్ లక్ష్మణరావు, మురళి, ఆనంద్ రామన్న, చిట్టిబాబు, బీమన్న, ఎం.నాగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటి గంగరాజు

టిడిపి నేతల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవో నెంబర్ 1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామిపై వైసిపి ఎమ్మెల్యేల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దళిత ఎమ్మెల్యే పై దాడి చేసిన వైసీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, నాయకులు కే.సుబ్బారావు, అడకట్ల కుమార్, కళ్యాణ్, త్రినాథ్, జగ్గయ్య , నన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:

టిడిపి దళిత ఎమ్మెల్యేపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పెదలబుడు సర్పంచ్ దాసుబాబు తెలిపారు. దాడికి నిరసనగా తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర అధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసుబాబు, దోన్ను దొర మాట్లాడుతూ,వైసీపీ నేతలు ప్రవర్తన మారకపోతే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, నేతలు త్రినాథ్, చందు పాడి, బోరిబొరి లక్ష్మీ, ద్రౌపతి, కళ, అర్జున్, నాగేశ్వరరావు, రాజు, ఆనంద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్ పురం

మండలంలో అకాల వర్షాలు, వడగళ్ళ వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చి, పొగాకుతో పాటు జీడి, మామిడి పంటలకు వర్షాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం గానీ, ప్రభుత్వాధికారులు గానీ ఇంతవరకు స్పందించకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో తీవ్ర కలత చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏటా ఏదో విధంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇటువంటి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కేవలం పబ్లిసిటీ చేసుకొని రైతులను గాలికొదిలేదస్తుందని విమర్శించారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి చిత్తశుద్ధితో రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

27, 28, 29 తేదీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి- చింతూరు

పోలవరం ముంపు ప్రాంతాలకు సంబంధించి ఈ నెల 27, 28, 29 తేదీల్లో చింతూరు పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న సోమవారం చింతూరు పంచాయతీ పరిధిలోని 1, 2, 3, 16, 17, 18, 19, 20 క్లస్టర్ల పరిధిలో ప్రజలకు సంత పక్కన క్రికెట్ మైదానంలో గ్రామసభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 28న మంగళవారం 7, 8, 9, 10, 11, 13 క్లస్టర్ పరిధిలోని ప్రజలకు బిసి కాలనీ చర్చి ప్రాంగణంలోనూ, 29న బుధవారం 4, 5, 6, 12, 14, 15, 21 క్లస్టర్ల పరిధిలోని ప్రజలకు ఎస్టీ కాలనీ వేగితోట రోడ్డు ఖాళీ మైదానంలోనూ గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామ వాలంటీర్ల వద్ద ఉన్న లిస్ట్‌లను చూసుకొని తప్పులుంటే సరి చేసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల నమోదు తదితర అంశాలపై గ్రామసభలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు తప్పకుండా హాజరుకావాలని కోరారు.



నూకాలమ్మ దర్శనానికి క్యూకట్టిన భక్తులు

వైభవంగా నూకాలమ్మ పండగ


ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు నలుమూలల నుంచి నూకాలమ్మ అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించింది.

ధారాలమ్మ ఆలయంలో...

జీకే వీధి మండలంలోని ధారాలమ్మ అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుతో పాటు మైదాన ప్రాంతం నుంచి భక్తులు తండోపతండాలుగా ఆలయానికి వచ్చిన అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో తీర్థయాత్రను తలపించింది.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-జగనన్న గోరు ముద్దలో రాగి జావ
-జిల్లాలో 91,412 మంది విద్యార్థులకు లబ్ది
-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



గోరుముద్ద పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, గోరుముద్దలో భాగంగా మరో పోషకాహారం రాగి జావను చేర్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు వారానికి మూడు రోజులు రాగి జావను అందిస్తామన్నారు. మంగళవారం సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో రాగి జావ పంపిణీని సీఎం ప్రారంభించిన సందర్భంగా కలెక్టరేట్లో లాంచనంగా రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2,704 పాఠశాలల్లోని 91,412 మంది విద్యార్థులకు లబ్ది చేకూరు తుం దన్నారు. రాగి జావలో ఐరన్, కాల్షియం, పోటాషియం అధికంగా ఉంటాయన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ, క్లాస్ టీచర్, ఇంగ్లీషు టీచరు ఉన్నారా అని ఆరా తీసారు. పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వెయ్యి ఆంగ్ల పదాలను నేర్చుకుంటే ఇంగ్లీషు బాగా మాట్లాడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎస్‌కె సలీం భాషా, డిఆర్‌ఒ పి.అంబేద్కర్, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఉదయ భాస్కర్, డిఎస్‌ఒ ఆర్.శివ ప్రసాద్, డిఎం బి.గణేష్ కుమార్, వివిద పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థులకు సంపూర్ణ పౌష్టికాహారం లభిస్తుందని ఎంపీపీ బి.ఈశ్వరి చెప్పారు. మండల కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు కే.బాలాజీ పథకం ప్రారంభించారు. ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, సర్పంచ్ వి.వెంకటరావు విద్యార్థులకు రాగిజావను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.రామచందర్‌రావు, వైసీపీ మండల నాయకులు బి.సింహాచలం, విద్యా కమిటీ చైర్మన్ ఎం మేరీ, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ దొంకినవలస ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు రాగి జావను వైస్ ఎంపీపీ.సూడిపల్లి కొండలరావు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాకూరు రాజుబాబు, దొంకిన వలస వార్డ్ మెంబర్ మజ్జి రాజారావు పాల్గొన్నారు.

అరకులోయ: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన పౌష్టిక ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అరకులోయ జెడ్పిటిసి రోషిణి, ఎంపీపీ ఉషారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ భారతి రత్నం రాగి జావ పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి, ఎంపీపీ మాట్లాడుతూ, విద్యార్థులకు పోషక విలువలు అందించేందుకు పోర్టు ఫ్రైడ్ రైస్ అందించిన ప్రభుత్వం రాగి జావా కూడా అందిస్తుందన్నారు. రాగిజావతో ఎముకల్లో శక్తి పెరుగుతుందన్నారు. రక్తహీనత లోపాన్ని నివారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాలరావు, ఇన్చార్జి ఎంపిడీవో రాంబాబు, ఏటిడబ్ల్యుఓ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు సుందర్రావు, వైసీపీ నేత అశోక్, ఎంపీటీసీలు దురియా ఆనంద్ కుమార్, ఎల్బి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక జెడ్పిటిసి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని టోకురు పంచాయతీ పరిధి బాలికల పాఠశాలలో బేటి బచావో భేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పలు సదుపాయాలు కల్పిస్తుందని,ఉన్నత చదువులు చదివి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి ఎన్ సూర్యలక్ష్మి డమ్మికు, అనంతగిరి 2, .టోకూరు కేంద్రాలలో సందర్శించి గర్భిణులు, బాలింతలకు స్టాక్ హెూమ్ ఐటమ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోసియా, ఎంపీటీసీ రత్నకుమారి పాల్గొన్నారు

సీలేరు : జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామన్నపడాల్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్ కమిటీ చైర్మన్ నీతు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం పాఠశాలలో తహసీల్దార్ తిరుమలరావు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి యుటిఎఫ్ నేతల నివాళి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ : మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, అమరజీవి అప్పారి వెంకటస్వామి 22వ వర్ధంతిని స్థానిక యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు మాట్లాడుతూ, అప్పారి వెంకటస్వామి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ సంఘ నిర్మాణంలో కీలక బాధ్యతను పోషించారన్నారు. సంఘ నిర్మాణంలో కీలకంగా పని చేసిన గొప్ప త్యాగశీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ ఎస్.కన్నయ్య. కోశాధికారి కే.ఆనంద్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఎం.మోహన్, కోటేశ్వరరావు, సీతారాం, మేఘనాథ్ పాల్గొన్నారు..

భూముల రీ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ పరిరక్షణ హక్కు పథకంను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని భీమవరం పంచాయతీ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జడ్పీటీసీ మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వేల్లో ఎటువంటి గొడవలకు తావులేకుండా సమకరించా లన్నారు. నీలంపుట్టు గ్రామంలో సందర్శించి చెరుకు సాగు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నైని. సన్నిబాబు, ఆర్ఐ రంగారావు, మండల, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాసకొండమ్మ జాతర

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బొయితిలి గ్రామంలో రాసకొండమ్మ తల్లి జాతర రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ జాతరకు కొత్త అమావాస్య కావడంతో తెల్లవారుజాము నుండే పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. భక్తులు భారీ ఎత్తున పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు చొరవ తీసుకొని భక్తులకు ముందస్తు ఏర్పాటు చేశారు

వంతెన పనులు పరిశీలన

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండలంలోని బొయితిలి గ్రామం మధ్యలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను జడ్పీటీసీ మత్స్యరస వెంకట లక్ష్మి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, ఎస్‌టి సెల్ జోనల్ ఇంచార్జ్ కిముడు విశ్వ, బోయితీలి సర్పంచ్ మల్లన్న, రమణరావు పాల్గొన్నారు.

వైద్య పరికరాల పంపిణీకి చర్యలు : పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలోని ఆసుపత్రులకు అత్యవసర వైద్య పరికరాలు పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ స్పష్టం చేశారు. ఐటిడిఎ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రిలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, కేర్ ఇండియా ఫౌండేషన్ అధికారులతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియా ఫౌండేషన్, ఐటిడిఎ సంయుక్తంగా సిఎస్ ఆర్ కింద వైద్య ఉపకరణాలు పంపిణీ చేయడానికి ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్స్ లు, అవసరమైన మహాప్రస్థానం అంబులెన్ లను సమకూరుస్తామని చెప్పారు. పాడేరు జిల్లా ఆసుపత్రికి చింతపల్లి,అరకు వేలీ ఆసుపత్రులకు శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య పరికరాలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాష, కేర్ ఇండియా ఫౌండేషన్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్ల ఆందోళన





చింతూరు డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయం, రంపచోడవరం ఐటిడిఎ ఎదుట ధర్నాలు చేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-చింతూరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మంగళవారం చింతూరులో ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. చింతూరు సెంటర్ నుండి డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల నియమాకాలు ప్రభుత్వం ద్వారానే జరగాలని, పని భారాన్ని తగ్గించాలని. సెలవులు మంజూరు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కమిటీల ద్వారా నియామకాలు చేయడంతో రాజకీయ నాయకుల ప్రాబల్యం పెరిగి కష్టపడి పని చేసే వారిని తొలగించి వారి స్థానాల్లో అధికార పార్టీ అనుయాయులను నియమిస్తున్నారని విమర్శించారు. ప్రతి రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయంలో ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు ఉండాలని, రెండు పూటలా సంతకాలు చేయాలని వేధించడం సరికాదన్నారు. విలేజ్ క్లినిక్‌లు క్లీన్, ఓపి వర్క్, అటెండర్ పనులు అప్పగించడం దారుణమన్నారు. సంబంధం లేని ఆన్‌లైన్ వర్క్‌లు చేయించడం ఆపాలన్నారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పోడియం లక్ష్మణ్, బి.దిలీప్, టి.లక్ష్మయ్య, ఆశ యూనియన్ నాయకులు వీరమ్మ, దారేశ్వరి, స్వప్న, నాగమణి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : 66 రోజుల పాటు ఐటిడిఎ ఎదుట దీక్షలు చేపట్టిన సందర్భంగా నాటి ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చెయ్యాలని ఐటిడిఎ ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం ఐటిడిఎ ఎపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఆలిండియా కమిటీ సభ్యులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ 2021 ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఐదుగురు ఆశవర్కర్లు చనిపోవడంతో వారి కుటుంబాలను ఆదుకోవాలని చేపట్టిన 66 రోజుల దీక్షల్లో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, కాకినాడ జిల్లా కలెక్టర్ హరి కిరణ్ ప్రభుత్వంతో మాట్లాడి అన్ని డిమాండ్స్ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి దీక్షలు విరమింపజేశారని గుర్తు చేశారు. కాని ఆ హామీని నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఏడు మండలాల ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన

- తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ
- డాక్టర్ జమాల్ ఖాన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతూరు

పురాతన కాలం నుండి మానవాళికి ఉపయోగపడుతున్న ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని తెలంగాణ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ ఆయుర్వేద ఔషధ వనమూలిక వైద్య సేవలను గుర్తించి ఆయన్ను తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవ మనుగడకు అవసరమయ్యే వనమూలిక ఔషధ మొక్కలను నాటి, ఆ వైద్యంపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి భావి తరాలకు ప్రాణ వాయువును అందించాలని సూచించారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఇలాంటి వైద్యం అందించడానికి హైదరాబాద్ వంటి మహానగరంలో కూడా క్యాంపులు నిర్వహించాలని కోరారు. దీనికి స్పందించిన డాక్టర్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ వనమూలికలు సరిపడా లభించడం లేదని, సిబ్బంది, మరికొంత మంది వైద్యులు అవసరం ఉంటుందని తెలిపారు. కొంత మంది అల్లోపతి వైద్యులకు ఆయుర్వేదంలో శిక్షణ ఇచ్చి తద్వారా ఎక్కువ మంది రోగులకు ఆయుర్వేద వైద్యం అందించాలన్నారు. మనిషి స్వార్థానికి అడవులను విచక్షారహితంగా నరికి వేయడంతో ఎంతో విలువైన ఔషధ మొక్కలు అంతరించి పోయాయని తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి.., ఏ మేరకు ఔషధ మొక్కలు అవసరం ఉంటాయో తెలియజేస్తే అటవీశాఖ వారికి ఆదేశాలు జారీ చేసి, ఔషధ మొక్కలు పంపిణీ చేసే విధంగా ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ముస్లిం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముజాహిద్ హుస్సేన్, బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి మానే రామకృష్ణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి, ఎస్‌కె.షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జమాల్ ఖాన్‌ను సత్కరిస్తున్న తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ

అంగన్వాడీలపై ప్రభుత్వ చర్యలకు ఖండన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో నిర్బంధం, అరెస్టులు, గృహ నిర్బంధాలు వంటి చర్యలకు పూనుకోవడాన్ని అఖిలభారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఉపాధ్యక్షుడు ఐవీ రమణ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 20న విజయవాడలో అంగన్వాడీలు చేపట్టిన మహా ధర్నా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. అర్ధరాత్రి సమయంలో మహిళల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడం, మహిళల ఇళ్లకు మగ పోలీసులు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు.

లోకుల గాంధీ పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : లోకుల గాంధీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ వాల్ పోస్టర్‌ను కొయ్యూరు సిఐ స్వామినాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి లోకుల గాంధీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ ద్వారా అందించే రూ.15వేలు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు లోకుల చంద్ర కిరణ్, మురుకుర్తి అప్పలరాజు, రీమల చంద్రరావు, అరిమెల రాజు, సంపరి శివకుమార్, రమేష్, పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి -కొయ్యూరు : యువతకు గ్రామాల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారంపై అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ ప్రోగ్రాం మానిటరింగ్ యూనిట్ ప్రతినిధి గోపాల్ సూచించారు. గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో మండలంలోని శరభన్నపాలెం, నడింపాలెం, బట్టపణుకుల, పెదమాకవరం, కినపర్తి, వెలగలపాలెం పంచాయతీల పరిధిలోని 28 గ్రామాల యువతకు గ్రామ సమస్యలు, స్థానిక అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారంపై అవగాహన కల్పించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన సుమారు రూ.3.50 లక్షలు చెక్కులను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ చేతుల మీదుగా మంగళవారం చెక్కులు అందజేశారు. 2021లో వినాయక చవితి నిమజ్జనంలో ప్రమాదవశాత్తు జడ్డంగి మడేరు వాగులో కొట్టుకుపోయిన చిన్నారులు పొకల త్రిమూర్తులు, నాగం బిందులత తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి మంజూరైన రూ.1,50,000 చెక్కును అందజేశారు. వాతంగి జురా చిన్ని బాబుకి అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.40 వేలు చెక్కు అందజేశారు. వైసీపీ నాయకులు సింగరేణి రామకృష్ణ, కొంగర మురళీకృష్ణ, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, చెరుకుంపాలెం సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, అడపా కామేష్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -కొయ్యూరు : పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచి కోడా చింతల్లి రాజబాబు, ఎంపీటీసీ పొడుగు రత్నం పిలుపునిచ్చారు. ఎం.మాకవరంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి పోటుకూరి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి అరుణ, పలువురు వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి -అడ్డతీగల : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ అనూష ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలోనూ, ఎంపిపి పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

అంగన్‌వాడీలపై పోలీస్ నిర్బంధం ఆపాలి : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఈ నెల 20న చలో విజయవాడకు పిలుపునిస్తే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని ఐద్వా విశాఖజిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ, రాజ్యాంగం ఇచ్చిన నిరసన తెలియజేసే హక్కును జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. అరెస్టులతో, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని, న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని స్పష్టంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించడంలేదన్నారు. తెలంగాణా కన్నా అదనంగా రూ.1000 పెంచుతామని హామీ ఇచ్చారని, 2021 నుంచి వర్కర్లకు రూ.13,650, హెల్పర్లకు, మినీ వర్కర్లకు రూ.7,800 ఇస్తున్నారని తెలిపారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై దాడి పట్ల నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులపై బయోలాజికల్ కంపెనీ చేసిన అమానుష దాడిని వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ, బెంగళూరుకు చెందిన బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ యాజమాన్యం కంపెనీ తరఫున పనిచేస్తున్న సేల్స్ రిప్రెజెంటేటివ్‌లను ఎటువంటి కారణమూ లేకుండా ఒకరిని సస్పెండ్ చేశారని, మరొకరిని వేరే రాష్ట్రానికి బదిలీ చేశారని చెప్పారు. బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ సేల్స్ రిప్రెజెంటేటివ్‌ల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఎం.సంజయ్ కుమార్ ఈ నెల 13న బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ మేనేజర్ కృష్ణ మోహన్ కెజియాన్ దగ్గర ఉన్న ఎరీజ్ హోస్పిటల్‌కి వచ్చారని తెలిసి అక్కడకు వెళ్లారని చెప్పారు. బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీలో పనిచేస్తున్న సేల్స్ రిప్రెజెంటేటివ్‌లను కారణం లేకుండా ట్రాన్స్‌ఫర్లు చేయవద్దని, టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేయొద్దని వినతి ఇవ్వగా నిరాకరించారు. ఇది జరిగిన రోజు అర్ధరాత్రి రైల్వే కాలనీలోని సంజయ్‌కుమార్ ఇంటికి నలుగురు వ్యక్తులు దాడి చేయడానికి వచ్చారని, ఆయన ఇంట్లో లేకపోవడంతో ఫోన్ చేసి నానా దుర్భాషలాడారని వివరించారు. తనపై దాడి చేయడానికి ఇంటికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు సోమవారం స్పందనలో సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారని చెప్పారు. సంజయ్‌కుమార్ పట్ల తనను తిట్టినట్లు బ్రిటిష్ బయోలాజికల్ మేనేజర్ కృష్ణమోహన్ తిరిగి మహారాణిపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు. ఇటువంటి చర్యలు తగవన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎర్ర శ్రీనివాస్, ఎం.సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజెఎఫ్‌లో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఉగాది సంబరాలు నిర్వహించారు. జర్నలిస్టులకు ఉగాదికిట్లు పంపిణీ చేశారు. పలువురిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉగాదితో ప్రారంభమయ్యే శోభకృత్ నామ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ రామేశ్వరి, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విజెఎఫ్ ప్రతినిధులు నాగరాజ్ పట్నాయక్, దాడి రవికుమార్, ఎస్.వీరభద్రరావు పాల్గొన్నారు.

జి-20 సదస్సుకు పక్కా ఏర్పాట్లు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న జి-20 సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చే అతిథులకు కూడా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. వియంఆర్‌డిఏ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ దేశాలకు చెందిన అతిథులు రాక సందర్భంగా విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రోజు వారి కార్యక్రమాలు, వారి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు తగు చర్యలు చేపట్టాలన్నారు. వారు బస చేసే హోటల్ వద్ద 24/7 హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయాలని, ఈ హెల్ప్ డెస్క్‌లో రెవెన్యూ, జివిఎంసి, మెడికల్, పర్యాటక శాఖలకు సంబంధించి సిబ్బంది 3 షిఫ్టులుగా పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలోనూ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసిలో కంట్రోల్ రూం నిరంతరం పనిచేయాలన్నారు. నగర సుందరీకరణ పనులపై జివిఎంసి కమిషనర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు. కేంద్ర మంత్రులు రాక సందర్భంగా వారికి బస, లైజన్ ఆఫీసర్లు, ఎస్కార్ట్, వాహనాలు, తదితర ఏర్పాట్లు చూడాలని డిఆర్‌ఒ ఆదేశించారు. ఈ సదస్సుకు వచ్చే రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీన 80 మంది ఫారెన్ డెలిగేట్స్ విశాఖ రానున్నట్లు తెలిపారు. 28వ తేదీ రాత్రికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రానున్నారని చెప్పారు. అధికారులందరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించి జి-20 సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్. విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ఏర్పాట్లపై మేయర్ సమీక్ష

జి-20 సదస్సు ఏర్పాట్లపై మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులనడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో మంగళవారం ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, అదనపు కమిషనర్లు వర్మ, డాక్టర్ బి సన్యాసిరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ దామోదర్‌తో సమావేశమై జి - 20 ఏర్పాట్లపై ఆరాతీశారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి సుమారు 200 మంది అతిథులు వస్తున్నందున వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

గ్రంథాలయ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణంపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వన్‌టౌన్ పరిధి చెంగలరావుపేట పంజా జంక్షన్‌లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని అపార్ట్‌మెంట్ నిర్మాణం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సిఐటియు నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ జోన్ నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న స్థలంలో కొంత భాగంలో ప్రభుత్వ గ్రంథాలయం ఉండేదన్నారు. గ్రంథాలయ భవనాన్ని పడగొట్టి అపార్ట్‌మెంట్ నిర్మిస్తుంటే జివిఎంసి అధికారులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ఆక్రమణపై తాము స్పందనలో మూడు పర్యాయాలు ఫిర్యాదుచేసినా అధికారుల్లో చలనం లేదు సరికదా భవన యజమానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, శ్రీను, ప్రసాద్, బాయి సాహెబ్, వెంకటరావు పాల్గొన్నారు.

అభ్యసనం ఆనందదాయకంగా సాగాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అభ్యసన విధానం ఆనందదాయకంగా సాగాలని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, నేటితరానికి అవసరమైన భవిష్యత్తు నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో డిజిటల్ యూనివర్సిటీలు రానున్నాయని చెప్పారు. ఆచార్యులు నిరంతరం అభ్యాసకులుగా మారాలన్నారు. అభివృద్ధికి కేంద్రంగా యువతరం నిలుస్తున్నారని తెలిపారు. గత ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని విభాగ దినోత్సవంలో చర్చించాలన్నారు. అనంతరం విద్యలో, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య కె.సమత, విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్యులు కె.రమాసుధ, ఆచార్య శ్రీనునాయక్ ప్రసంగించారు.

డీఎస్సీ అభ్యర్థులకు వైసిపి మోసం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అధికారంలోకి వస్తే ఏటా జనవరి 1న నూతన జాబ్ క్యాలెండర్ ప్రకటించి మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి దాన్ని విస్మరించి నిరుద్యోగులను మోసం చేశారని ఎఐఎస్‌ఎఫ్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు పేర్కొన్నారు. నాలుగేళ్ల నుంచి ఇళ్లకు దూరంగా ఉంటూ, కోచింగ్ సెంటర్లకు రూ.లక్షలు వెచ్చించి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న సమయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్రంలో 717 టీచర్ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 50,896 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో 39008, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 11888 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నియామకాలు జరపకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తక్షణం 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

'బిఎస్‌ఎన్‌ఎల్' రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపక దినం సందర్భంగా ఉద్యోగులు మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బిపి, సుగర్, కొలెస్ట్రాల్ తదితర వైద్య పరీక్షలు కూడా జరిపారు. ఈ సందర్భంగా బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, తమ సంస్థ ఉద్యోగులు ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడాన్ని అభినందంచారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ, 4జి నెట్ వర్క్ వెంటనే ఇవ్వాలని, వేజ్, పెన్షన్ రివిజన్ చేపట్టాలని, బిఎస్‌ఎన్‌ఎల్‌ను ప్రయివేటీకరించొద్దని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గ్లోబల్ సమ్మిట్, ఎమ్మెల్సీ ఎన్నికలు

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జిల్లాలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, అందుకు సహకరించిన ప్రతి అధికారికీ, సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన ఎన్నికల విధులలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణలో ప్రతి అధికారి, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. ముస్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించి విశాఖ జిల్లా కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, శిక్షణ ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం : జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి- ఎంవీపీ కాలనీ : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఎంజిఎం పార్కులో జి-20 సదస్సు సందర్భంగా భారతీయ యోగా విద్యనూ దేశ విదేశీయులకు పరిచయం కోసం సాధన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లడుతూ జి-20 సదస్సు విశాఖ నగరంలో జరగడం మనకు గర్వకారణమన్నారు. అతిథులకు భారతీయ సంస్కృతిలో భాగంగా యోగా సాధనతో స్వాగతం పలకడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించడం, విద్యార్థులకు యోగా తప్పని సరిగా నేర్పడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, డిసి (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి నల్లనయ్య, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, జెడి (అమృత్) విజయభారతి, పీడీ (యుసిడి) కెవి.పాపునాయుడు, డిపిఒ చక్రవర్తి, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, బొడ్డేపల్లి రాము, సింహాచలం, మల్లయ్యానాయుడు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహంపై ప్రత్యేక దృష్టి

గీతంలో ఎస్‌టిపిఐ అదనపు డైరెక్టర్ డాక్టర్ సురేష్



ఎస్‌టిపిఐ అదనపు డైరెక్టర్ సురేష్‌ను సత్కరిస్తున్న గీతం ప్రొఫెసర్ శిరీష

ప్రజాశక్తి- మధురవాడ: దేశంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు 2025 నాటికి 10 వేల స్టార్టప్‌లను ప్రోత్సహించాలని ప్రభుత్వ లక్ష్యమని, దీనికి గాను సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) ప్రత్యేకంగా యువతపై దృష్టి సారించిందని ఎస్‌టిపిఐ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.సురేష్ అన్నారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశంలో ప్రతి 29 రోజులకు ఒక యూనికార్న్ స్టార్టప్ ఏర్పాటు అవుతోందన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే స్టార్టప్‌లలోఅధిక శాతం దక్షిణ భారతదేశంలోనే నెలకొంటున్నాయన్నారు.యువతలో నూతన ఆలోచనలు ఇంక్యుబేషన్ కేంద్రాల నుంచి స్టార్టప్‌లుగా మారే క్రమంలో కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే విజయవంతం అవుతున్నాయన్నారు. దీనిని 30 నుంచి 35 శాతం వరకు పెంచేందుకు ఎస్‌టిపిఐ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. ప్రధాన ఐటి కంపెనీలు కీలకమైన నగరాలకు మాత్రమే పరిమితం అవుతున్నందున ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలలో సాఫ్ట్‌వేర్ సంబంధ కంపెనీల ఏర్పాటుకు తాము కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సరికొత్త ఐటి టెక్నాలజీలపై పరిశ్రమలు ఏర్పాటుకు దేశవ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కృత్రిమ మేధ, ఫిన్‌టెక్, వ్యవసాయ రంగం, బ్లాక్‌చైన్‌లలో స్టార్టప్‌లకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. . ఆంధ్రప్రదేశ్‌లో విశాఖతో పాటు కాకినాడ, విజయవాడ, తిరుపతి పట్టణాలలో ఎస్‌టిపిఐ విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు వస్తే దేశ ప్రగతిలో భాగస్వామ్యులను చేసేందుకు ఎస్‌టిపిఐ సిద్ధంగా ఉందన్నారు.కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష అధ్యక్షత వహించగా ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అభిజీత్ పాల్గొన్నారు.

యువతలో నాయకత్వ లక్షణాలు పెంచడమే లక్ష్యం



షిప్‌యార్డ్ సందర్శనలో గీతం విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ: యువతలో నాయకత్వ లక్షణాలను, వివిధ అంశాలపై లోతైన అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిందనిబయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఖాసిం బీబీ తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ వివిధ విభాగాల నుంచి 30 మంది ఔత్సాహికులను యంగ్‌లీడర్స్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వివిధ వర్క్‌షాప్‌లు, వ్యక్తిత్వ వికాస తరగతులతో పాటు స్థానిక పరిశ్రమలను సందర్శన, అక్కడి నిపుణులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను గీతం విద్యార్థులు సందర్శించారు. పరిశ్రమలో భద్రత అంశాలు, నౌకా నిర్మాణ విశేషాలను ఆయా విభాగాల నిపుణులు వివరించారు. జాతి నిర్మాణంలో షిప్‌యార్డ్ పాత్ర, ప్రస్తుత ప్రాజెక్టుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. షిప్‌యార్డ్ సీనియర్ ఇంజనీర్, గీతం పూర్వ విద్యార్థి శాంతికుమార్ గీతంతో తన అనుబంధాన్ని విద్యార్థులకు వివరించారు.

జలవనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని మంగళవారంఘనంగా నిర్వహించారు. గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ ప్రత్యేక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రక్షిత జలవనరులు లభించకపోవడం వల్ల ఏటా ప్రపంచంలో 1.4 మిలియన్ల జనాభా మరణిస్తున్నారని, 74 మిలియన్ల మంది వివిధ రకాల రోగాలతో బాధపడుతున్నారన్నాఉరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి నలుగురిలో ఒకరు మాత్రమే రక్షిత నీటిని వినియోగిస్తున్నారని తెలిపారు. సగానికి పైగా ప్రపంచ జనాభా పరిశుభ్రతలేని వాతావరణంలో తాగు నీటిని ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. 2050 నాటికి ప్రపంచ నీటి అవసరాలు 55 శాతం పెరగనున్నాయని, దీనికి గాను జల వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలో పాల్గొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ కుమార్, టి.మాలతి పాల్గొన్నారు.



గీతంలోప్రపంచనీటి దినోత్సవ అవగాహన ర్యాలీ

ఏడాదిలో 486 న్యూరో సర్జరీలు

- త్వరలో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం
- 35 స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీ
- ఆరోగ్య శ్రీ పథకంలో పలు ఉచిత వైద్య సేవలు
- విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

ప్రజాశక్తి - అరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఏడాదిలో 486 న్యూరో సర్జరీలు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు వెల్లడించారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధిత చికిత్సలెన్నో జరిపించామని, ఆర్థోసేవలు, 70మందికి పిఆర్‌డి థెరపీ, హెడ్, మోకాలు ట్రాన్స్‌ప్లాంటేషన్, స్పైనల్ లాప్రోస్కోపీ వంటి సేవలు నిర్వహించామన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, విమ్స్‌కునిత్యం 600 నుంచి 700 అవుట్ పేషెంట్లు వస్తుంటారని, సగటున 200లకు తక్కువ లేకుండా ఇన్‌పేషెంట్లు వస్తున్నారన్నారు. విమ్స్‌లో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలక్ష ఐసీయూ, వెంటిలేటర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి రోగులొస్తున్నారన్నారు.



.డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

త్వరలో 'స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్'


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో విమ్స్‌లో 'స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్' త్వరలో ఏర్పాటు కానుందని, ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయన్నాఉఉ. ఆ సెంటర్ విశాఖలో ఏర్పాటైతే ఏపీలోనే అది తొలి సెంటర్ అవుతుందని డాక్టర్ రాంబాబు స్పష్టం చేశారు. వైద్య పరికరాలొస్తే వైద్యం చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకోసం ఓ హాలుతో పాటు 20బెడ్‌లు, పరికరాలు సిద్ధం చేశామన్నారు. విమ్స్‌లో పనిచేసేందుకు వైద్యసిబ్బంది ఆసక్తి చూపిస్తుంటారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, అవసరమైన అధునాతన పరికరాలు అందుబాటులో ఉండడమే దీనికి కారణమన్నారు సమయపాలన ఇక్కడ కచ్చితంగా పాటిస్తున్నామన్నారు. సిబ్బంది లంచం తీసుకుంటే ఫిర్యాదివ్వవచ్చని సూచించారు. విమ్స్‌లో త్వరలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ కూడా రానుందని తెలిపారు. నగరంలో మరే ఆస్పత్రిలోనూ లేనంతగా ఉచితంగా సేవలు అందుబాట్లోనే ఉంటాయన్నారు. కేథల్యాబ్ సేవలు కూడా రానున్నాయన్నారు. రోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. త్వరలో 35స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల్ని భర్తీ చేస్తున్నట్టు తెలిపారు..

ఆరోగ్య శ్రీ పథక పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

విమ్స్‌లో మరెక్కడా లేని విధంగా ఆరోగ్య శ్రీ పథక పరిశీలనకు 15నుంచి 20మందితో కూడిన ప్రత్యేక వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఆరోగ్య శ్రీలో పూర్తి ఉచితంగానే వైద్య సేవలుంటాయన్నారు. పల్మనాలజీ, చెస్ట్‌ఫిజీషియన్, ఇఎన్‌టీలో కాక్లియర్ ఇంప్లాంటేషన్, జనరల్ మెడిసిన్, వైరల్ జ్వరాలైన మలేరియా, టైఫాయిడ్ తదితర వాటికి సిబ్బంది వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. విమ్స్‌లో 33మంది వైద్యులు, 212మంది నర్సులు, 200మంది వైద్య సిబ్బంది, 70మంది కార్యాలయ సిబ్బంది, 40మంది టెక్నీషియన్లు, నలుగురు ఫిజియోథెరపిస్టులు, 70మంది పారిశుధ్య సిబ్బంది, 50మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. విమ్స్‌లో ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రయత్నిస్తున్నామని, అందరూ సహకరించాలని ఆ సంస్థ డైరెక్టర్ కె.రాంబాబు కోరారు.

వైద్యసాయానికి ఎదురుచూపు

ప్రజాశక్తి -మాధవధార : 50వ వార్డు తెన్నేటినగర్. ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల అంపోలు హరీష్ చంద్ర అనే బాలుడు ఆస్టియో ఆథరైటిస్ అనే ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యానికి ఆర్థికసాయం, చేయూత కోసం ఎదురుచూస్తున్నాడు. బాలుని తండ్రి మాధవరావు దినసరి కూలిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. బాధిత బాలుడు హరీష్‌చంద్రకు ఇంటర్నల్ రేడియాలజీ ద్వారా ఆపరేషన్ చేయాలని, ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ భవానీ ప్రసాద్ తెలిపారని బాలుని తండ్రి మాధవరావు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు అంత ఆర్థికస్థోమత లేదని, ఆపరేషన్, వైద్యఖర్చులకు దాతలు సహకరించాలని కోరుతున్నాడు. ఫోన్‌పే నెంబర్ 9393111607, ఎస్‌బిఐ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 30945181783 ద్వారా సాయం చేయాలని కోరుతున్నాడు.



అంపోలు హరీష్‌చంద్ర

24న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఈ నెల 24న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లుజిల్లా ఉపాధి కల్పనాధికారి కె సుధ తెలిపారు. అపోలో హోమ్ కేర్ సంస్థలో హోమ్ కేర్ నర్సు, హోంకేర్ నర్స్ అసిస్టెంట్ పోస్టులు 50 ఖాళీల కొరకు పిసిఎ/ఎంపిహెచ్‌డబ్ల్యు/ బిఎస్‌సి నర్సింగ్ అర్హత కలిగి 18 -40ఏళ్ల వయస్సు గలవారు అర్హులు. అనుభవాన్ని బట్టి రూ.12,500 నుంచి రూ.28,200 వరకు వేతనం చెల్లిస్తారు. అలాగే వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్ షిప్ మేనేజర్ 50 పోస్టులు భర్తీకి ఏదైనా డిగ్రీ, టు వీలర్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 20-35ఏళ్ల పురుషులు మాత్రమే అర్హులన్నారు.నెలసరి వేతనం రూ 13,500 నుండి రూ.24,500 చెల్లిస్తారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలని, ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

నూతన ఆవిష్కరణకు నాంది పలకాలి

గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవంలో డాక్టర్ జయ్‌కుమార్



బిజయ్‌కుమార్ సాహును సత్కరిస్తున్న గాయత్రి విద్యాపరిషత్ ప్రతినిధులు

ప్రజాశక్తి -పిఎం పాలెం.: కొమ్మాది గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారంకళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ డిఎస్ఐఆర్, ఐపిఎఫ్‌సి అండ్ టిఐఎస్‌సి సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు బ్లాక్ చైన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కోరారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటినీ సాధించడానికి విద్యార్థినులు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో కీలక భూమిక పోషిస్తున్నారని విద్యార్థినులు కేవలం ఉద్యోగ సాధన ధ్యేయంగా కాకుండా స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌కె. గోస్వామి,గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, కమిటీ సభ్యులు దక్షిణామూర్తి, గణపతి, వైస్ ప్రిన్సిపల్ సుధీర్ పాల్గొన్నారు.

విధులను బహిష్కరించి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఆత్మూరి వెంకట భగవానులు అనే న్యాయవాదిపై నిరాధారాలతో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం మేరకు కోర్టు విధులను బహిష్కరించి, న్యాయవాదులు నిరసన చేపట్టారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, న్యాయవాదిపై పెట్టిన తప్పుడు కేసును వెనక్కు తీసుకోవడంతోపాటు బాధ్యులైన పోలీస్ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా ఎపి డిజిపి పోలీసులకు తగిన సూచనలు ఇవ్వాలని బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్ కృష్ణమోహన్ కోరారు అనంతరం జిల్లా కోర్టు ప్రధానద్వారం వద్ద గంట సేపు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు కోశాధికారి పెళ్లి భాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు ఎస్ఎస్ఎన్ రాజు, బాగ తులసీదాస్, బగాది తులసీదాస్, పల్క శ్రీరామమూర్తి, రాఘువేంద్రరావు పాల్గొన్నారు